# ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

తేది:26.01.2023

ద్రావిడ విశ్వవిద్యాలఅయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం వర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ, రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డిలు వర్సిటీ నూతన అకడమిక్ భవనం వద్దనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలోని శ్రీకృష్ణదేవరాయులు విగ్రహం, సరస్వతీ దేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్సిటీ ఎన్‌సిసి క్యాడెట్లు కవాతు నిర్వహించి వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశానికి ప్రాణత్యాగాలు చేసిన ప్రతి ఒక్క మహాత్ముడిని స్మరించుకోవడం మన బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆగష్టు 15న స్వాతంత్ర్యం అనంతరం దేశంలో విభిన్న మతాలు, వివిధ సంస్కృలు, వివిధ జీవన విధానాలు, విభిన్న భాషలు అభివృద్ధి చెందిన తరువాత సంక్లిష్టమైన ఎన్నో అంశాల మధ్య అందరికీ సమానంగా రాజ్యాంగం అమలు చేయడం భారతదేశంలోనే సాధ్యమైందన్నారు. మహామేధావులైనటువంటి వారు బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మహామేధావి డా.బి.ఆర్.అంబేద్కర్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీ మన భారతదేశ రాజ్యాంగాన్ని రూపొందించిందన్నారు. ప్రపంచ దేశాల్లోని ఉత్తమమైనటువంటి రాజ్యాంగాలను తెప్పించి వాటిని అవపోసన పట్టి వాటిలోని సుగుణాలన్నీ కూడా క్రోడీకరించుకుని అంతకంటే గొప్పదైనటువంటి ప్రజాస్వామిక ఒక రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామన్నారు. మన రాజ్యాంగము అమలులోకి వచ్చిన రోజునే మనకు రిపబ్లిక్ డేగా ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని అన్నారు.

## ఆచార్య బి.రామకృష్ణారెడ్డికి పద్మ శ్రీ అవార్డు పట్ల హర్షం

ద్రావిడ విశ్వవిద్యాలయంలో మొదటి రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ఆచార్య బి.రామకృష్ణా రెడ్డి గారికి కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ అవార్డు బహుకరించడం పట్ల వర్సిటీ తరపున రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య బి.రామకృష్ణారెడ్డి గారు తెలంగాణకు చెందిన వ్యక్తిగా పద్మ శ్రీ అవార్డు వచ్చిందని.. అయితే ఆయన చిత్తూరు ప్రాంతానికి సంబంధించిన వ్యక్తి అని తెలిపారు. లింగ్విస్టిక్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన లిటరేచర్, ఎడ్యుకేషన్ విభాగంలో ఈయనకు పద్మ శ్రీ అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా కువీ, మండ, కుయి వంటి గిరిజన దక్షిణాది భాషల పరిరక్షణకు కృషి చేస్తున్నారని.. ఇతర భాషల్లో గిరిజన భాషల మధ్య వారధిలా ఈయన ఉన్నారన్నారు. మండ ఇంగ్లీషు డిక్షనరీ, కువీ, ఒరియా ఇంగ్లీషు భాషలకు సంబంధించిన డిక్షనరీలను రూపొందించారన్నారు. దీంతో పాటు ఐదు పుస్తకాలను రచించారని.. ద్రావిడ విశ్వవిద్యాలయ మొదటి రిజిస్ట్రార్‌గా పనిచేయడం మన గర్వపడుతున్నామన్నారు. వర్సిటీ పక్షాన ఆచార్య బి.రామకృష్ణారెడ్డి ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ వేడుకల్లో వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

– డా.ఎమ్.ఎస్.దుర్గాప్రవీణ్, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం












Satyamēva Jayatē